# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 16 జూన్ 2025 | పేజీలు 8




అపార్ట్‌మెంట్ సెట్‌బ్యాకుల్లో వాచ్‌మెన్ రూములు..

# రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో...
# నారాయణ హైస్కూల్

- దుండిగల్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతివాటానికి నిదర్శనం..
- బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో పాఠశాల..
- సెట్‌బ్యాకుల్లో వాచ్‌మెన్ గదుల నిర్మాణం..! ముడుపులు స్వీకరించి "ఎన్‌వోసి"..
- ఏకంగా కమర్షియల్ కార్యకలాపాలు.. నారాయణ హైస్కూల్ ఏసీ క్యాంపస్..
- సీజ్ చేస్తామన్న మేడ్చల్ జిల్లా డిఈఓ, దుండిగల్ ఎంఈఓ..
- వారం క్రితమే విద్యాశాఖ నుంచి, పర్మిషన్ ఇచ్చామని ఎంఈఓ కృష్ణ సమాధానం..
- సెట్‌బ్యాకులు ఆక్రమించిన రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో పాఠశాల నిర్వహణ..
- విద్యాశాఖ తప్పుడు పర్మిషన్‌లతో విచ్చలవిడిగా కార్పోరేట్ పాఠశాలలు..
- ప్రభుత్వ పాఠశాలలను అణిచివేసే ధోరణితో ప్రైవేటు స్కూళ్ళను ప్రోత్సహిస్తున్న వైనం..
- కాసుల కక్కుర్తితో మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలు.. విద్యాశాఖ అడ్డగోలు పర్మిషన్‌లు..

- విద్యార్థులను ప్రమాదంలో పెడుతున్న మున్సిపల్, విద్యాధికారులు..
- కార్పోరేట్ విద్యాసంస్థకు వత్తాసుగా జిల్లా, మండల విద్యాధికారి"..
- రెసిడెన్షియల్ భవనంలో కమర్షియల్ కార్యకలాపాలపై కమిషనర్ సైలెంట్..




-2లో

అక్రమ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో.. నారాయణ హైస్కూల్.. ఏసీ క్యాంపస్ రెడీ..

ఓవైపు మున్సిపల్ అధికారులు.. మరోవైపు విద్యాశాఖ అధికారులు, అక్రమార్కులకు హద్దుమీరి సహకరిస్తున్నారు.. వీళ్ళకు తోడు కొందరు ఏ పదవుల్లేని నాయకుల సిఫార్సులు తోడై, పోటాపోటీగా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.. కార్పోరేట్ విద్యాసంస్థలకు చెందిన, అక్రమ నిర్మాణాలైనా..! విద్యాశాఖ తప్పుడు పర్మిషన్‌లు అయినా ఇట్టే ఇస్తున్నారు.. లక్షల్లో ముడుపులు స్వీకరించి, నిబంధనలు, టిజి-బిపాస్ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారు.. అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ, విధులకే కలంకం తెస్తున్నారు.. దుండిగల్ మున్సిపాలిటీ ఏర్పాటే, అక్రమ నిర్మాణాల కోసమే అన్నట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు..రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో, బౌరంపేట్ "నారాయణ హైస్కూల్" పర్మిషన్ వ్యవహారంలో, జిల్లా విద్యాధికారితో పాటు, దుండిగల్ ఎంఇఓ, మున్సిపల్ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు ముట్టాయని ఆరోపణలు వస్తున్నాయి.. అక్రమ నిర్మాణంలో కమర్షియల్ కార్యకలాపాలపై "పెన్ పవర్" దినపత్రికలో వార్తా కథనాలు వచ్చినప్పటికీ.. అధికారపార్టీ నేత సిఫార్సులు ఉన్నాయని, విధులు తాకట్టు పెడుతున్నారు.. పైనుండి ప్రెజర్ ఉందని దుండిగల్ కమిషనర్ చర్యలు తీసుకోకుండా సహకరించడం గమనార్హం.. అటు టౌన్‌ప్లానింగ్ అధికారిని కూడా యధారాజా తధాప్రజా అన్నట్లు, చర్యలకు దూరంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 15:

# జర్నలిస్టుల సమస్యలపై.. త్వరలో ఉద్యమ కార్యాచరణ..

- టిడబ్ల్యూజేఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు..
- రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య..



**కరీంనగర్, పెన్ పవర్, జూన్ 15:** రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలపై త్వరలో ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు.. పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఎవరికీ భయపడకుండా నిస్వార్థంగా, నిర్భయంగా వృత్తిలో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఆదివారం కరీంనగర్ లోని టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో ఫెడరేషన్ జిల్లా సీనియర్ ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు..

# సీఎం రేవంత్ తో కేంద్రమంత్రి జయంత్ చౌదరి భేటీ



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రమంత్రి జయంత్ చైదరి సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. తెలంగాణలో నైపుణ్యాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ కు సంబంధించి తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రికి వివరించారు సీఎం రేవంత్. రాష్టంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు కేంద్ర మంత్రి. రాష్టంలో స్కిల్ డెవలప్మెంట్ కు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందన్న కేంద్ర మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. జూన్ 16న కౌశల్ మందన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు

-5లో

# రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో.. నారాయణ హైస్కూల్..


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
అక్రమ కట్టడాలకు సూత్రదారులే..!
"కమిషనర్-టిపిఎస్"..?


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
దుండిగల్ మున్సిపాలిటీలో...
కమర్షియల్ దోపిడీ...?



నాలుగు మీటర్ల సెట్‌బ్యాకుల స్థలంలోనే సెల్లార్‌కి దారి..



రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌ను.. నారాయణ హైస్కూల్ నిర్వహణకు సిద్ధం..


పెన్ పవర్
నారాయణ..! బోర్డు తీసేయ్..
స్కూల్ మూసేయ్..


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
దుండిగల్ మున్సిపాలిటీలో...
రెసిడెన్షియల్ పర్మిషన్‌తో..!
కమర్షియల్ కట్టడాలు..!


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
పర్మిషన్‌లేని పాఠశాల అడ్మిషన్‌లకు..!
తల్లితండ్రులదే బాధ్యత..!
దుండిగల్ విద్యాధికారి కృష్ణ బాధ్యతా రహితంగా సమాధానం..


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
NARAYANA HIGH SCHOOL
బౌరంపేట్ "నారాయణ హైస్కూల్‌కి"..!
అనుమతుల్లేవు..!


పెన్ పవర్
తెలంగాణ రౌండప్
హైస్కూల్ "సీజ్" చేయకుండా..!
తీసుకున్న "ఫీజు" ఎంత..?

**దుండిగల్ మున్సిపల్ అధికారుల చేతివాటంతో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుంటే..! విద్యాధికారుల చేతివాటంతో విద్యార్థులను రిస్కులో పెడుతున్నారు.. రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌ను అద్దెకు తీసుకుని "నారాయణ హైస్కూల్" ఏసీ క్యాంపస్ పేరిట కమర్షియల్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.. మొన్నటి వరకు చర్యలు తీసుకుంటామని చెప్పిన "డీఈఓ-ఎంఈఓ" ఇప్పుడు పర్మిషన్ ఇచ్చామని చెప్పడం, విద్యాధికారుల బరితెగింపు అవదులు దాటుతున్నాయి.. మరోవైపు బౌరంపేట్ సర్వే నెం.524, 525, 567 వ్యవసాయ భూములను హెచ్ఎండిఏ ప్రకటించిన కన్జర్వేషన్ జోన్‌లో "వ్యాసా పాఠశాలకు" నిర్మాణ అనుమతులు లేకపోయినా, ఆక్యుపెన్సీ సర్టిఫికేట్, లేకపోయినా..! విద్యాశాఖ నుండి అనుమతులు మజూరు చేయడం అవినీతి అధికారులకు నిదర్శనం.. కార్పోరేట్ విద్యాసంస్థలకు మంత్రులు, నేతల అండ ఉంటుందనే అహంతో ప్రైవేటు పాఠశాలలకు, విద్యాశాఖ ఇష్టానుసారంగా అనుమతులు మంజూరు చేస్తున్నారు.. ప్రమాదాలు సంభవిస్తే తప్పించుకోలేని విధంగా "సింగిల్ ఎగ్జిట్" రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లే లక్ష్యంగా కార్పోరేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు..**

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్ లహరి గ్రీన్‌పార్క్ రోడ్డులో.. లహరి గ్రీన్‌పార్క్ ఎదురుగా ఉన్న "బిఎస్ఆర్ ఐకాన్‌లోని" ప్లాట్ నెం.858/ఎ, 859/ఎ ప్లాట్‌లకి చెందిన స్థలం సుమారు 940 గజాల్లో నిర్మాణానికి..! దుండిగల్ మున్సిపాలిటీ నుంచి "1 సెల్లార్, 1 గ్రౌండ్, 4 పై అంతస్తులకు" రెసిడెన్షియల్ అనుమతులు తీసుకున్నారు.. నివాసయోగ్యమైన ఈ భవనం చుట్టూ..! టిజి-బిపాస్ చట్టం నిబంధనల ప్రకారం, 4 మీటర్లు (13.5 ఫీట్లు) సెట్‌బ్యాకులు వదిలిపెట్టి నిర్మాణం చేపట్టాలని పర్మిషన్‌లో సూచించారు.. అయినప్పటికీ సంబంధిత బిల్డర్ రాజారెడ్డి నిర్మాణ దశలోనే కమర్షియల్ కార్యకలాపాలకు అనుగుణంగా ప్లాన్ చేశాడు.. మొదట్లో రోడ్డువైపు కమర్షియల్ షెట్టర్‌లను నిర్మించాడు.. పెన్ పవర్ వార్తా కథనంతో షెట్టర్‌లను తొలగించారు.. అపార్ట్‌మెంట్ చుట్టూ ఉండాల్సిన 4 మీటర్ల సెట్‌బ్యాకుల స్థలంలో ఒకవైపు సెట్‌బ్యాకుల స్థలంలో, ఆక్రమించి వాచ్‌మెన్ రూమును, సెల్లార్‌కి వెల్లడానికి దారిన నిర్మించాడు..అయినప్పటికీ మున్సిపల్ అధికారులు "ఆక్యుపెన్సీ సర్టిఫికేట్" జారీ చేయడం అధికారుల చేతివాటానికి నిదర్శనం..

## అప్పుడు సీజ్ చేస్తామన్నారు.. ఇప్పుడు పర్మిషన్ ఉందంటున్నారు..

బౌరంపేట్‌లో అక్రమ రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో కమర్షియల్ కార్యకలాపాలకు అద్దెకు ఇచ్చి, ఎలాంటి అనుమతులు లేకుండానే "నారాయణ హైస్కూల్" నిర్వహిస్తుండగా.. వేసవిలో భారీగా అడ్మిషన్‌లు కూడా తీసుకున్నారు.. ఈ విషయాన్ని దుండిగల్ మండలం విద్యాధికారి కృష్ణ, మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారితో ప్రస్తావించగా, సీజ్ చేస్తామని, కట్టుకథలు చెప్పారు.. అడ్మిషన్‌లతో తమకు సంబంధం లేదని, తరగతులు మొదలైన తరువాతే చర్యలు తీసుకుంటామని బాధ్యతా రహితంగా సమాధానం చెప్పారు.. తీరా చూస్తే ఇప్పుడు వారంరోజుల క్రితమే, పర్మిషన్ ఇచ్చామని, దుండిగల్ ఎంఈఓ కృష్ణ సమాధానం పలు అనుమానాలకు తావిస్తోంది.. దుండిగల్ మున్సిపల్ కమిషనర్ "ఎన్వోసి" ఇచ్చారని, దాని ఆధారంగానే విద్యాశాఖ నుండి నారాయణ హైస్కూల్‌కి పర్మిషన్ ఇచ్చామని ఎంఈఓ సమాధానం చెపుతున్నారు.. రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లో, నారాయణ హైస్కూల్ కమర్షియల్ అవుతుంది కదాని, ఎంఈఓతో ప్రస్తావించగా..! మున్సిపల్ కమిషనర్ స్కూల్ పెట్టడానికి అనుమతి ఇచ్చారని చెప్పడం అనుమానాలను రేకెత్తిస్తుంది..


కరీంనగర్ టిడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో సమావేశం..

# జర్నలిస్టుల సమస్యలపై... త్వరలో ఉద్యమ కార్యాచరణ

## టిడబ్ల్యూజేఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు..

## రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య..

**కరీంనగర్, పెన్ పవర్, జూన్ 15:** రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలపై త్వరలో ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు.. పాత్రికేయుల సమస్యలపై సమిష్టి పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జర్నలిస్టులు ఎవరికీ భయపడకుండా నిస్వార్థంగా, నిర్భయంగా వృత్తిలో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఆదివారం కరీంనగర్ లోని టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో ఫెడరేషన్ జిల్లా సీనియర్ ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య అధ్యక్షతన నిర్వహించిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, ముఖ్యంగా గ్రామీణ విలేకరుల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం పదేళ్లు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తుందని ఆయన ధ్వజమెత్తారు..

### సమస్యలపై పోరాటానికి జర్నలిస్టులు ఏకం కావాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఇంత వరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదని అన్నారు. సమస్యలపై పోరాడేందుకు జర్నలిస్టులంతా కలిసి రావాలని, రాబోయే రోజుల్లో సమస్యలపై పోరాటం చేయడానికి సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు.. రాష్ట్రంలో రెండు జర్నలిస్టు సంఘాలు పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని ఆయన విమర్శించారు.. అలాంటి సంఘాల పట్ల జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పాలకుల పక్షాన చేరి పదవులు పొంది, జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేని సంఘాలకు సమస్యలపై నిజాయితీగా పోరాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ సంఘాన్ని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు..

### త్వరలో టిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర మహాసభలు..

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఇతర సంఘాల పట్ల నమ్మక విశ్వాసం కోల్పోయారని, అందుకే ఆయా సంఘాల నుంచి పెద్ద ఎత్తున టీడబ్ల్యూజేఎఫ్‌లో చేరుతున్నారని చెప్పారు. రాబోయే రెండు మూడు నెలల్లో అన్ని జిల్లాల్లో యూనియన్ మహాసభలు పూర్తి చేసి పెద్ద ఎత్తున రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని మామిడి సోమయ్య తెలిపారు.. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఫెడరేషన్‌ను బలోపేతం చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని, పాలకుల వివక్ష వల్ల జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడి బాధ్యతలను నల్లగొండ సత్తయ్యకు అప్పగిస్తూ జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అనంతరం సంఘం సభ్యులకు అధ్యక్షుడు మామిడి సోమయ్య ఫెడరేషన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, ఫెడరేషన్ నాయకులు గాదె కరుణాకర్ రావు, సిహెచ్ వెంకట్ రాజు, అతికం రాజశేఖర్, కొమ్ము గణేష్, చట్ల శంకర్, గుండి కిరణ్, సురేష్, శంకర్ రెడ్డి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.





# బాసరలో విషాద ఘటన... గోదావరిలో నీటమునిగి ఐదుగురు మృతి

## కుత్బుల్లాపూర్ చింతల్ వాసులుగా గుర్తింపు..

## రాజేష్, రితిక్ కచువా, మదన్ , భరత్







- పుణ్యస్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు గోదావరిలో మునిగి మృతి
- మృతులంతా హైదరాబాద్ చింతల్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు
- నీటి లోతుపై అవగాహన లేకపోవడమే ప్రమాదానికి కారణం
- మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి, అధికారులకు కీలక ఆదేశాలు











### మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి, అధికారులకు ఆదేశాలు

ఈ దుర్ఘటనపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదుగురు యువకుల మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నదులు, నీటిపారుదల ప్రాజెక్టుల వద్దకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాలు, నదులు, ప్రాజెక్టుల వద్ద లోతును తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జనవరిలో కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు హైదరాబాద్ విద్యార్థులు సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో నీట మునిగి చనిపోయారని, అలాగే వారం రోజుల క్రితం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకులు గల్లంతయ్యారని మంత్రి గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన బాసరలో గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లిన ఐదుగురు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో బాసరలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులంతా హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన ఒక కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఈ కుటుంబంలోని మొత్తం 18 మంది సభ్యులు ఆదివారం బాసరలోని సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం, అలాగే గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వచ్చారు. ఆలయ దర్శనానికి ముందు, సంప్రదాయం ప్రకారం నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఐదుగురు యువకులు నదిలోకి దిగి, నీటి ప్రవాహంలో లోపలికి వెళ్లారు. నీటి లోతుపై సరైన అంచనా లేకపోవడంతో వారు ఒక్కసారిగా మునిగిపోవడం ప్రారంభించారు. నది ఒడ్డున ఉన్న కుటుంబ సభ్యులు ఇది గమనించి కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, నిపుణులైన ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. మృతులను రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌లుగా గుర్తించారు. వీరంతా 20 ఏళ్ల లోపు వయస్సు వారే కావడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోదావరి ఘాట్ వద్ద తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు తక్షణమే తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# 171 నెంబరుకు ఎయిరిండియా బైబై

**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం (ఐఎక్స్ 171) టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే కుప్పకూలిపోవటం.. విమానంలో ప్రయాణిస్తున్న వారిలో ఒక్కరు మినహా 270 మంది మరణించటం తెలిసిందే. ఏఐ171 నెంబరుతో బోయింగ్ 787-8 విమానం కూలిన నేపథ్యంలో.. ఇప్పుడా సర్వీసు నెంబరును ఎయిరిండియా తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. విమానయాన రంగంలో ఏదైనా విమానం ప్రమాదానికి గురైనప్పుడు.. దాని కారణంగా ప్రాణనష్టం చోటు చేసుకుంటే.. సదరు విమాన నెంబరును తొలగించే సంప్రదాయం ఉంది.తాజా దుర్ఘటన నేపథ్యంలో ఎయిరిండియా ఏఐ171, ఐఎక్స్ 171 పేర్లను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 17 నుంచి నడిచే విమానానికి సరికొత్త నెంబరును కేటాయించారు. 17వ తేదీన అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే విమానాన్ని ఏఐ159 నెంబరుతో వ్యవహరిస్తారు. ఈ మేరకు టికెట్ బుకింగ్ వ్యవస్థలోనూ మార్పులు చేసినట్లుగా పేర్కొన్నారు.ఎయిరిండియా ఎక్స్ ప్రెస్ సైతం తన విమానానికి ఉన్న ఐఎక్స్ 171 నంబరును వదులుకుంటున్నట్లుగా ప్రకటించింది. దీనికి సంబంధించిన కొత్త నంబరును ప్రకటించలేదు. ప్రమాదంలో మరణించిన వారికి నివాళిగా పాత నంబరును వదిలేసుకోవటం ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీగా చెప్పాలి. ఇప్పుడు ఆ సెంటిమెంట్ ను ఎయిరిండియా ఫాలో అయ్యిందని చెప్పాలి.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం: ఒకే బాడీ బ్యాగ్ లో రెండు తలలు... సవాలుగా మారిన మృతుల గుర్తింపు!

**హైదరాబాద్ పెన్ పవర్:**అహ్మదాబాద్‌ను వణికించిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిని గుర్తించే ప్రక్రియ అధికారులకు పెను సవాలుగా మారింది. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండటంతో, వారి ఆనవాళ్లను పట్టి బంధువులకు అప్పగించడం అత్యంత కష్టతరంగా తయారైంది. ఈ క్రమంలో ఎదురవుతున్న ఊహించని అవాంతరాలు బాధిత కుటుంబాల ఆవేదనను మరింత పెంచుతున్నాయి.మృతుల గుర్తింపులో డీఎన్ఏ పరీక్షలే కీలకంగా మారాయి. అయితే, ఈ ప్రక్రియలోనూ అనుకోని అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఒక దిగ్భ్రాంతికర ఘటనలో, ఒకే బాడీ బ్యాగులో రెండు తలలు లభ్యమవడం గందరగోళానికి దారితీసింది. దీంతో డీఎన్ఏ నమూనాలను మళ్లీ మొదటి నుంచి సేకరించి పరీక్షించాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడిందని సివిల్ ఆసుపత్రి సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సాధారణంగా 72 గంటలు పట్టే డీఎన్ఏ పరీక్షల ప్రక్రియ, ఈ తాజా పరిణామంతో మరింత ఆలస్యం కానుంది.శనివారం సివిల్ ఆసుపత్రి పోస్టుమార్టం గది వెలుపల హృదయవిదారక దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. తమవారి పూర్తి శరీర భాగాలను అంత్యక్రియల నిమిత్తం అప్పగించాలంటూ ఓ వ్యక్తి అధికారులను వేడుకోవడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. అయితే, మృతదేహాలు తీవ్రంగా కాలిపోయినందున అది సాధ్యం కాదని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

### సీఎం రేవంత్ తో కేంద్రమంత్రి

## జయంత్ చౌదరి భేటీ

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ వచ్చారు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి.యువతలో నైపుణ్యాలను పెంచాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే.తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి చైర్‌పర్సన్‌గా ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ ఆనంద్ మహీంద్రా.. కో చైర్మన్‌గా విద్యావేత్త శ్రీనివాస్ సి. రాజును రాష్ట్ర సర్కారు నియమించిన సంగతి తెలిసిందే..

# గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 16 మంది మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:**గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతోంది. శుక్రవారం రాత్రిపూట నుంచి శనివారం ఉదయం వరకు జరిపిన దాడుల్లో 16 మంది పాలస్తీనియన్లు మరణించినట్టు స్థానిక ఆరోగ్య అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్, అమెరికా మద్దతుతో నడిచే ఒక మానవతా సంస్థ నిర్వహించే ఆహార పంపిణీ కేంద్రాల సమీపంలో రాత్రిపూట జరిగిన దాడుల్లో 11 మంది పాలస్తీనియన్లు మరణించారు. ఈ కేంద్రాలు గత నెలలో ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు రోజూ ఇలాంటి కాల్పులు జరుగుతున్నాయి. ఇజ్రాయెల్ దళాలు జన సమూహంపై కాల్పులు జరిపినట్లు పాలస్తీనియన్ ప్రత్యక్ష సాక్షులు చెప్పగా.. తమ దళాల సమీపంలోకి వచ్చిన అనుమానితుల వద్ద హెచ్చరిక కాల్పులు మాత్రమే జరిపినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఈ కాల్పులపై ఆర్మీ వెంటనే స్పందించలేదు. ఈ కేంద్రాలను నిర్వహించే గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ అనే ప్రైవేట్ సంస్థ.. శనివారం ఈ కేంద్రాలు మూసివేసినట్లు తెలిపింది. అయితే, ఆహారం కోసం వేలాది మంది ఈ కేంద్రాల సమీపంలో గుమిగూడారని సాక్షులు చెప్పారు. సెంట్రల్ గాజాలోని ఒక జీహెచ్?ఎఫ్? కేంద్రం సమీపంలో జరిగిన కాల్పుల్లో ఎనిమిది మృతదేహాలు లభ్యమయ్యాయని, మరో 125 మంది గాయపడి ఆస్పత్రికి వచ్చారని అల్-అవ్దా హాస్పిటల్ తెలిపింది.

సమీపంలోని బురేజ్ శరణార్థి శిబిరంలో ఉన్న మొహమ్మద్ అబు హుస్సేన్ మాట్లాడుతూ.. ఆహార పంపిణీ కేంద్రం నుంచి ఒక కిలోమీటర్ దూరంలో ఇజ్రాయెల్ దళాలు జన సమూహంపై కాల్పులు జరిపాయని తెలిపాడు. వేలాది మంది పరుగెత్తుతుండగా.. పలువురు నేలకొరిగారని అతను తెలిపాడు.

# దేశంలోని టాప్ 7 నగరాల్లో ఆఫీసు స్పేస్ అద్దెకు తీసుకున్నది ఆ కంపెనీలేనట



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆసక్తికర రిపోర్టు ఒకటి బయటకు వచ్చింది. దేశంలోని టాప్ 7 నగరాల్లో అత్యధికంగా స్థలాల్ని లీజుకు తీసుకున్న సంస్థల వివరాల్ని వెల్లడయ్యాయి. ఆసక్తికరంగా మొత్తం లీజ్ లో 33.3 శాతం సంస్థలు అమెరికాకు చెందినవే కావటం గమనార్హం. 2022-24 మధ్య దేశంలోని ఏడు పెద్ద నగరాల్లో 6.5 కోట్ల చదరపు అడుగుల ఆఫీసు స్పేస్ ను అమెరికా సంస్థలు అద్దెకు తీసుకున్న విషయాన్ని జేఎల్ఎల్ ఇండియా వెల్లడించింది.ఇది మొత్తం ఆఫీసు స్పేస్ లో 33.3 శాతంగా పేర్కొంది. ఢిల్లీ - ఎన్ సీఆర్, ముంబయి, చెన్నై, కోల్ కతా, బెంగళూరు, హైదరాబాద్, పుణె మార్కెట్లలో మొత్తం 19కోట్ల చదరపు అడుగుల స్థలం అద్దెకు వెళ్లింది. వీటిల్లో ఎక్కువగా అమెరికా కంపెనీలు లీజ్ కు తీసుకున్నాయి. భారత్ లో నిపుణుల లభ్యత ఎక్కువగా ఉండటం.. ఖర్చులు తక్కువగా ఉండటం దీనికో కారణంగా పేర్కొంటున్నారు. ఈ అమెరికా కంపెనీల దీర్ఘకాలిక పెట్టుబడులు.. రీసెర్చ్ - డెవలప్ మెంట్ కేంద్రాల ఏర్పాటుతో దేశాన్ని ఆవిష్కరణ హబ్ గా మార్చేందుకుసాయం చేస్తుందని చెబుతున్నారు. తాజా రిపోర్టులో అమెరికా కంపెనీలు దేశంలోని టాప్ 7 నగరాల్లో తమ ఓటు

బెంగళూరు మహానగరానికి వేస్తున్నట్లుగా జేఎల్ఎల్ రిపోర్టు వెల్లడించింది.

# గుజరాత్ మాజీ సీఎం మృతదేహం గుర్తింపు... ఇప్పటి వరకూ ఎన్నంటే..?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఈ నెల 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదం మిగిల్చిన విషాదం ఇంకా కళ్లముందు కదలాడుతూనే ఉందని అంటున్నారు. ఈ ప్రమాదంలో దేశం మొత్తం ఒక్కసారిగా తీవ్ర దిగ్భ్రాంతికి గురవ్వగా.. వందల కుటుంబాలు దుఃఖ సాగరంలో మునిగిపోయాయి.

ఈ ప్రమాదంలో విమానంలో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది మృతి చెందగా.. జనావాసాల్లో ఉన్న వారు సుమారు 33 మంది మరణించారని అధికారులు చెబుతున్నారు. ఇలా విమానంలో ప్రయాణించి మరణించిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఉన్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన మృతదేహాన్ని డీఎన్ఏ సాయంతో వైద్యులు గుర్తించారు.

అవును... అహ్మదాబాద్ లో ఈ నెల 12న జరిగిన ఘ్గోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగి మూడు రోజులు అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఈ ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు బృందలు తీవ్రంగా పరిశోధిస్తున్నాయి. .

మరోవైపు మృతులను గుర్తించడానికి వైద్య బృందాలు అవిరామంగా శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా విజయ్ రూపానీ మృతదేహాన్ని గుర్తించారని.. రూపానీ కుటుంబ సభ్యుల శాంపిల్స్ తో మృతదేహం డీఎన్ఏ సరిపోలిందని.. గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వీ తెలిపారు. దీంతో.. భౌతికకాయాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించామని అన్నారు.

ఈ సందర్భంగా స్పందించిన బీజే మెడికల్ కాలేజ్ సీనియర్ గవర్నమెంట్ డాక్టర్.. ఇప్పటివరకూ 32 మంది మృతుల డీ.ఎన్.ఏ., వారి కుటుంబ సభ్యుల జన్యు పరీక్షలతో సరిపోలినట్లు తెలిపారు. ఈ క్రమంలో డీ.ఎన్.ఏ పరీక్షలు నిర్వహించిన అనంతరం ఇప్పటివరకూ 14 మంది మృతదేహాలను వారి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని అన్నారు.ఇదే సమయంలో.. డీ.ఎన్.ఏ పరీక్షలతో పనిలేకుండా బంధువులు గుర్తుపట్టిన 8 మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబసభ్యులకు ఇచ్చేశామని తెలిపారు. ప్రమాద తీవ్రత వల్ల ఒక్కో డీ.ఎన్.ఏ పరీక్షకు ఎక్కువసమయం పడుతుందని.. అందువల్ల గుర్తింపు ప్రక్రియ ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం: 31 మంది మృతదేహాల గుర్తింపు పూర్తి..

### 12 కుటుంబాలకు అప్పగింత



హైదరాబాద్ పెన్ పవర్:అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 31 మందిని డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించినట్టు సివిల్ ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. వీరిలో 12 మంది మృతదేహాలను ఇప్పటికే వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు తెలిపారు. మిగిలిన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, వీరిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతదేహం కూడా ఉందని, ఆయన డీఎన్ఏ పరీక్ష ఫలితాలు ఇంకా రావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.సివిల్ ఆసుపత్రి ఏడీఎంఎస్ డాక్టర్ రజనీష్ పటేల్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకు 31 మంది వ్యక్తుల డీఎన్ఏ సరిపోలింది, వారిని గుర్తించాం. వీరిలో 12 మృతదేహాలను ఉదయ్‌పూర్, వడోదర, ఖేడా, కుషీనగర్, అహ్మదాబాద్‌లోని వారి స్వస్థలాలకు పంపించాం" అని తెలిపారు. "మిగిలిన వారి ఆప్తుల మృతదేహాలను తీసుకెళ్లేందుకు మరికొన్ని కుటుంబాలు ముందుకు రావాల్సి ఉంది. ఇతరుల డీఎన్ఏ ఫలితాలు ఇంకా రావాల్సి ఉంది" అని ఆయన వివరించారు.మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ డీఎన్ఏ పరీక్ష ఇంకా కొనసాగుతోందని డాక్టర్ పటేల్ ధ్రువీకరించారు. "ఇప్పటివరకు ఆయన డీఎన్ఏ సరిపోలలేదు. ఫలితం రాగానే సంబంధిత అధికారులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన 13 మంది ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని కూడా ఆయన వెల్లడించారు.మృతదేహాలు తీవ్రంగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో, వాటిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి అయ్యాయి. రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) కు చెందిన ఫోరెన్సిక్ బృందాలు ఈ బృహత్తర గుర్తింపు ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. బాధిత కుటుంబాలకు త్వరితగతిన ఊరట కలిగించేందుకు ఈ బృందాలు అహోరాత్రులు శ్రమిస్తున్నాయి.

ఈ నెల 12న అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే అదుపుతప్పి సివిల్ ఆసుపత్రి బి.జె. మెడికల్ కళాశాల సమీపంలోని జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతంలో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమాన ప్రయాణికులు, నేలపై ఉన్న నివాసితులు సహా 260 మందికి పైగా మరణించారు. ఒక ప్రయాణికుడు మాత్రం గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం వల్ల సమీప ప్రాంతాల్లో, ముఖ్యంగా అక్కడి వైద్య విద్యార్థుల వసతి గృహాలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

## ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తత..

## యూకే యుద్ధవిమానాల మోహరింపు

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతి దాడులు జరుగుతున్న సమయంలో మిడిల్ ఈస్ట్ లో మరింత ఉద్రిక్తతలు పెరిగాయి. UK అదనపు సైన్యాన్ని, ముఖ్యంగా యుద్ధ విమానాలను కీలక స్థావరాలకు తరలించింది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై చేసిన దాడులలో UKకు ప్రత్యక్ష ప్రమేయం లేదని ఈ దాడులు ఏకపక్షంగా జరిగినవని UK చెబుతు న్నప్పటికీ ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో అమెరికా ,ఇజ్రాయెల్‌తో కలిసి బ్రిటీష్ యుద్ధ విమానాలు సాయం చేయడం మిడిల్ ఈస్ట్ లో మరింత ఉద్రిక్త వాతావరణ నెలకొంది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై తన మొదటి దాడులను ప్రారంభించినప్పటి నుంచి UKప్రధాని స్టార్మర్.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ,ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇద్దరితోనూ టచ్ లో ఉన్నారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు ఇజ్రాయెల్‌పై డ్రోన్లు ,క్షిపణుల దాడులతో ఇరాన్ ప్రతిదాడులు చేసింది. పరిస్థితి వేగంగా మారుతోంది..అలాగే తీవ్రంగా ఉందన్నారు స్టార్మర్.ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సంఘర్షణను UK తీవ్రంగా భావిస్తోంది.ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత పరిష్కారం కనుగొనాలని అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేయడానికి సిద్ధం అని స్టార్మర్ చెబుతూనే UK అదనపు సైన్యాన్ని, ముఖ్యంగా యుద్ధ విమానాలను కీలక స్థావరాలకు తరలించడం, మిడిల్ ఈస్ట్ లో ఉద్రిక్తతలు మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తున్నాయా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# మృత్యుంజయుడి మహిమ... విమానాల్లో 11ఏ సీటుకు అదనపు పేమెంట్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెల 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయలుదేరిన ఎయిరిండియా విమానం బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్.. టెకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందిలో.. ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. దీంతో.. ఆయన కూర్చున్న సీటుకు ఇప్పుడు డిమాండ్ విపరీతంగా పెరిగింది!అవును... అహ్మదాబాద్ లో ఎయిరిండియా విమానం బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్.. టెకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిపోయిన ఘటనలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీతో సహా 241 మంది మృతి చెందగా.. ఒకే ఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడుగా నిలిచిన సంగతి తెలిసిందే. ఎమర్జెన్సీ ఎగ్జిట్ పక్కనున్న 11ఏ సీటులో కూర్చున్న వ్యక్తి బ్రతికారు.



ఇందులో భాగంగా... విశ్వాస్ కుమార్ రమేష్ అనే ప్రయాణికుడు తాను కూడా ఊహించని రీతిలో గాయాలతో బ్రతికి బయటపడ్డారు. దీంతో.. ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ దగ్గర ఉన్న సీట్లు ప్రమాదంలో నుంచి బయటపడటంలో మిగిలినవాటి కంటే చాలా రెట్లు సహకరిస్తాయనే నమ్మకం విమాన ప్రయాణికుల్లో పెరిగిందనే చర్చ మొదలైంది. దీనిపై సోషల్ మీడియా వేదికగా చర్చ విపరీతంగా జరుగుతుంది.

ఈ సందర్భంగా... ట్రావెల్ ఏజెన్సీలు, బుకింగ్ ఫ్లాట్ ఫామ్ లు ఎమర్జెన్సీ ఎగ్జిట్ పక్కనున్న సీట్ల కోసం కస్టమర్స్ రిక్వెస్ట్ లు విపరీతంగా పెరిగాయని చెబుతున్నాయి. కొంతమంది ప్రయాణికులు ఈ సీటు కోసం అవసరమైతే అదనంగా చెల్లించడానికి సైతం సిద్ధంగా ఉన్నారని అంటున్నాయి. దీంతో... అహ్మదాబాద్ ప్రమాదం అనంతరం ఈ సీట్ల డిమాండ్ ఆసక్తిగా మారింది.వాస్తవానికి టేకాఫ్ కు ముందు క్యాబిన్ సిబ్బంది ఇచ్చే అడిషనల్ సెక్యూరిటీ సూచనల కారణంగా చాలా మంది ప్రయాణికులు ఈ ఎమర్జెన్సీ ఎగ్జిట్ పక్కనున్న సీట్లను ప్రిఫర్ చేయరని చెబుతుంటారు. అయితే.. తాజాగా జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఆ సీట్లో కూర్చున్న రమేష్ సజీవంగా బయటపడటంతో ఆలోచనలు మారుతున్నాయని అంటున్నారు.

అయితే.. దీనిపై స్పందించిన నిపుణులు.. ఎమర్జెన్సీ ఎగ్జిట్ వద్ద ఉన్న సీట్లు కాళ్లకు అదనంగా కాస్త స్పేస్ ను ఇస్తాయి తప్ప.. ప్రమాద సమయలో అడిషనల్ సెక్యూరిటీని ఏమీ ఇవ్వదని చెబుతున్నారు! అయితే... విమానంలోని మిగిలిన భాగాల్లో ఉన్న సీట్లతో పోలిస్తే వెనుక భాగంలో ఉన్న సీట్లలో భద్రత కాస్త ఎక్కువగా ఉంటుందని అధ్యయనం వెల్లడించిన సంగతి తెలిసిందే.

# ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలోకి మరో దేశం.. ఇక పశ్చిమాసియాలో మహా రణమే

**హైదరాబాద్ పెన్ పవర్:**పశ్చియాసియా అంటేనే కక్షల ప్రాంతం... ఇజ్రాయెల్ ఒకవైపు.. మిగతా అన్ని దేశాలు ఒకవైపు.. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం.. అలాంటిది మూడు రోజుల కిందట ఇరాన్ పైకి ఇజ్రాయెల్ దాడికి దిగింది.. ఇరాన్ దీనికి ప్రతిస్పందిస్తోంది. గట్టి జవాబు ఇస్తామని కూడా చెబుతోంది. ఇరాన్ అణు కార్యక్రమాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులకు అమెరికా మద్దతు ఉంది. అసలే ఇరాన్ అంటే అమెరికాకు కళ్ల మంట. శత్రువు కంటే ఎక్కువగా ఇరాన్ ను ట్రీట్ చేస్తుంది అమెరికా. 20 ఏళ్ల కిందటే ఇరాన్ ను రోగ్ కంట్రీ (ధూర్త దేశం) జాబితాలోకి చేర్చింది అమెరికా. ఆ దేశంపై అనేక ఆంక్షలు కూడా విధించింది. అలాంటిది అణు చర్చలు విఫలం అయ్యాక ఇరాన్ పై తీవ్రంగా మండిపడుతోంది.ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది. ఎందుకంటే.. ఇరాన్ అతిపెద్ద గ్యాస్ ఉత్పత్తి కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఇజ్రాయెల్ పై తాము సరికొత్త క్షిపణిని ప్రయోగించాం అని ఇరాన్ చెబుతోంది. అయితే, ఇరాన్ అణుకేంద్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ప్రకటించింది. కాబట్టి ఇరాన్ ప్రతీకారం ఏ విధంగా ఉంటుంది..? అనేది చూడాలి.



ఈ రెండు దేశాల మధ్య యుద్ధంలోకి తాజాగా మరో దేశం కూడా పాల్గొంట్లున్నట్లు తేలింది. ఇజ్రాయెల్ పై యుద్ధంలో ఇరాన్ కు తాము తోడుగా నిలుస్తున్నట్లు యెమెన్ ప్రకటించింది. ఈ మేరకు యెమెన్ సైన్యం ట్వీట్ చేసింది. గత 24 గంటల్లో యెమెన్ పైకి రెండు హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు తెలిపింది. ఇరాన్ సైన్యంతో కలిసి తాము చేసిన ఈ దాడులు విజయవంతం అయ్యాయని కూడా ప్రకటించింది. గాజాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండిస్తూ.. ఆ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందని పేర్కొంది.

వాస్తవానికి గత కొన్ని గంటలుగా హూతీలు లక్ష్యంగా ఇజ్రాయెల్ యెమెన్ మీద దాడులకు దిగుతోంది. హూతీలు అంటే ఎవరో కాదు.. యెమెన్ రెబల్స్. వీరు మొదటినుంచి హమాస్ కు మద్దతుదారులు. ఈ నేపథ్యంలో హూతీ సీనియర్ లీడర్లను టార్గెట్ చేస్తూ.. ఇజ్రాయెల్ దాడులకు దిగుతోంది. యెమెన్ కూడా రంగంలోకి దిగినందున ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ఏ మలుపు తీసుకుంటుందో చూడాలి.

# ఇదొక ఫ్యామిలీ ముఠా... ఏడాదిలో 25 కార్లు కొట్టేశారు!

- ఢిల్లీలో కుటుంబ సభ్యులతోనే నడుస్తున్న దొంగల ముఠా అరెస్ట్
- పది నెలల వ్యవధిలో 20 నుంచి 25 ఖరీదైన ఎస్‌యూవీల అపహరణ
- ముఠాలో తండ్రి, కొడుకు, అల్లుడు సభ్యులుగా గుర్తింపు
- అధునాతన పరికరాలతో కార్ల సెక్యూరిటీని నిమిషాల్లో బ్రేక్
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశ రాజధాని ఢిల్లీలో విలాసవంతమైన ప్రాంతాల్లో ఖరీదైన ఎస్‌యూవీ కార్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఓ కుటుంబ ముఠా గుట్టురట్టయింది. కేవలం పది నెలల వ్యవధిలోనే సుమారు 20 నుంచి 25 కార్లను అపహరించిన ఈ ముఠాలోని ముగ్గురు సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల్లో 56 ఏళ్ల వ్యక్తి, అతని కుమారుడు, అల్లుడు ఉండటం గమనార్హం.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రమణ్ (56), అతని కుమారుడు సాగర్, అల్లుడు నీరజ్ కలిసి ఈ కార్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకు, ఇతరుల ప్రమేయం లేకుండా ఉండేందుకే కేవలం కుటుంబ సభ్యులతోనే ఈ ముఠాను ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. వీరు ప్రధానంగా హ్యుందాయ్ క్రెటా, ఫార్చ్యూనర్, మారుతి బ్రెజా వంటి ఖరీదైన ఎస్‌యూవీలను లక్ష్యంగా చేసుకునేవారు.ఈ ముఠా సభ్యులు తెల్లవారుజామున, ఎక్కువగా పార్కులు, జిమ్‌ల వద్ద నిలిపి ఉంచిన కార్లను ఎంచుకునేవారు. అత్యాధునిక పరికరాలను ఉపయోగించి, కేవలం ఐదు నుంచి ఏడు నిమిషాల్లోనే కారు సెక్యూరిటీ వ్యవస్థను ఛేదించి, వాహనంతో పరారయ్యేవారు. వాహనాల్లో ఉండే ఆన్‌బోర్డ్ డయాగ్నస్టిక్ పోర్ట్‌లను తమ వద్ద ఉన్న ప్రత్యేక టూల్స్‌తో మానిప్యులేట్ చేసి, సెక్యూరిటీ వ్యవస్థను నిలిపివేసి కార్లను దొంగిలించేవారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.వరుస కార్ల చోరీలపై దృష్టి సారించిన ద్వారకా పోలీసులు, దొంగతనాల సరళిని, సమయాన్ని క్షుణ్ణంగా విశ్లేషించారు. ద్వారకా డీసీపీ అంకిత్ సింగ్ మాట్లాడుతూ, "సుమారు 200 సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించాం. చాలా ఘటనల్లో దొంగిలించబడిన వాహనాలను ఓ కారు అనుసరిస్తున్నట్లు గుర్తించాం," అని తెలిపారు. ఈ క్రమంలో అందిన పక్కా రహస్య సమాచారం మేరకు, ఉత్తమ్ నగర్‌లోని ఓ డ్రెయిన్ వద్ద పోలీసులు వల పన్నారు. నకిలీ నంబర్‌ప్లేట్‌తో ఉన్న తెల్లటి కారులో వచ్చిన రమణ్, సాగర్‌లను అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా, ఆ కారు కూడా దొంగిలించిందేనని నిర్ధారణ అయింది.

వారి కారును సోదా చేయగా, కార్ల దొంగతనానికి ఉపయోగించే రెండు కార్ స్కానర్లు, వైర్‌తో కూడిన ఒక హ్యాండ్ క్లిప్, రెండు కీ కనెక్టర్లు, ఒక ఇంజిన్ కంట్రోల్ మాడ్యూల్, రెండు సుత్తులు, ఆరు లాక్ టీ టూల్స్, ఒక వైర్ కట్టర్, ఒక కటింగ్ ప్లయర్, పన్నెండు తాళాలు, రెండు నకిలీ నంబర్‌ప్లేట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా, రమణ్ అల్లుడు నీరజ్ ప్రమేయం కూడా ఉందని తెలియడంతో, పోలీసులు అతన్ని కూడా అరెస్ట్ చేశారు.నిందితులు ముగ్గురూ కలిసి గత పది నెలల్లో 20 నుంచి 25 ఎస్‌యూవీలను దొంగిలించినట్లు విచారణలో అంగీకరించారు. ముఠాకు సూత్రధారి అయిన రమణ్, సమాచారం బయటకు పొక్కకుండా ఉండేందుకే తన కుటుంబ సభ్యులతో ఈ గ్యాంగ్ ఏర్పాటు చేసినట్లు పోలీసులకు వివరించాడు. దొంగిలించిన కార్లను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో కొందరు వ్యక్తులకు విక్రయించినట్లు వారు తెలిపారు. రమణ్‌పై గతంలో 18 కార్ల దొంగతనం కేసులు, సాగర్‌పై 12, నీరజ్‌పై 14 కేసులు ఉన్నాయని పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఏఐ రేసులో గూగుల్ వెనుకబడిందంటూ విమర్శలు... సుందర్ పిచాయ్ ఏమన్నారంటే!

- చాట్‌జీపీటీ రాకతో తన రాజీనామా కోరినట్లు వచ్చిన వార్తలను ప్రస్తావించిన పిచాయ్
- గూగుల్ అంతర్గత ఏఐ అభివృద్ధిపై తనకు పూర్తి అవగాహన ఉందని వెల్లడి
- బ్రెయిన్, డీప్‌మైండ్ వంటి కీలక బృందాలను ఏకం చేశానని గుర్తుచేసిన సీఈఓ
- విమర్శలను పట్టించుకోకుండా లక్ష్యంపైనే దృష్టి సారిస్తానని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో చాట్‌జీపీటీ వంటి నూతన ఆవిష్కరణల రాకతో టెక్ దిగ్గజం గూగుల్ వెనుకబడిందంటూ వచ్చిన తీవ్ర విమర్శలు, తన రాజీనామాకు సైతం డిమాండ్లు తలెత్తాయన్న వార్తలపై కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ స్పందించారు. గూగుల్ అంతర్గత ఏఐ ప్రగతిపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, అనవసరపు ఆర్భాటాలను పట్టించుకోకుండా లక్ష్యంపైనే దృష్టి సారించినట్లు ఆయన స్పష్టం చేశారు. తన బాధ్యతను ఓ ఫుట్‌బాల్ కోచ్‌తో పోల్చుకుంటూ, ఒత్తిడిని తాను ఎలా అధిగమిస్తారో వివరించారు.

ఇటీవల లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, ఒకానొక దశలో "గూగుల్ కచ్చితంగా ఏఐ రేసులో ఓడిపోతోంది," "సుందర్ పిచాయ్ తన మ్యాజిక్ టచ్ కోల్పోయారు" వంటి వ్యాఖ్యలు విస్తృతంగా ప్రచారమయ్యాయని, తాను పదవి నుంచి తప్పుకోవాలంటూ కథనాలు కూడా వచ్చాయని పిచాయ్ గుర్తుచేసుకున్నారు. "ఒక సీఈఓగా నేను తీసుకున్న ప్రధాన నిర్ణయం, కంపెనీని 'ఏఐ-ఫస్ట్' దిశగా నడిపించడమే. బాధ్యతాయుతమైన ఏజీఐ (ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్) అభివృద్ధి చేసి, ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన ఉత్పత్తులను అందించడమే మా లక్ష్యం," అని ఆయన ఉద్ఘాటించారు.

క్లిష్ట సమయాల్లోనూ, "సంస్థ అంతర్గతంగా మేం ఏం నిర్మిస్తున్నామో నాకు బాగా తెలుసు. బ్రెయిన్, డీప్‌మైండ్ వంటి అత్యున్నత స్థాయి పరిశోధనా బృందాలను ఏకం చేసి, 'గూగుల్ డీప్‌మైండ్'ను ఏర్పాటు చేయడం వంటి కీలక నిర్ణయాలు అప్పటికే తీసుకున్నాను," అని సుందర్ పిచాయ్ తెలిపారు. ఈ వ్యూహాత్మక చర్యల ద్వారా ఏఐ రంగంలో గూగుల్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంటోందని ఆయన పరోక్షంగా సూచించారు.

సవాళ్లను ఎదుర్కొనే తీరుపై మాట్లాడుతూ, "నేను అనవసరపు సందడిని (నాయిస్) పట్టించుకోను, ముఖ్యమైన సంకేతాలపైనే (సిగ్నల్) దృష్టి పెడతాను. గూగుల్‌ను నడపడం అంటే బార్సిలోనా లేదా రియల్ మాడ్రిడ్ వంటి పెద్ద జట్లకు కోచింగ్ ఇవ్వడం లాంటిది. ఫుట్‌బాల్ సీజన్లలో కొన్నిసార్లు కలిసిరాకపోవచ్చు ... అలాగే, టెక్ ప్రపంచంలో కొన్నిసార్లు ప్రతికూల ఫలితాలు రావచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. జెమినీ వంటి అధునాతన మోడళ్ల అభివృద్ధికి అవసరమైన కంప్యూటింగ్ శక్తిని సమకూర్చడం వంటి అంతర్గత ప్రయత్నాలు బయటి ప్రపంచానికి పూర్తిగా తెలియకపోవచ్చని, తాము మాత్రం నిర్దేశిత లక్ష్యాల దిశగా స్థిరంగా పయనిస్తున్నామని పిచాయ్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో హైటెన్షన్ వైర్లు తెగిపడి ఇద్దరు సజీవ దహనం

ఎల్బీనగర్‌లో తెల్లవారుజామున విషాదం

చింతల్‌కుంట వద్ద తెగిపడిన హైటెన్షన్ విద్యుత్ తీగలు

మృతులు యాచకులని పోలీసుల అనుమానం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లో ఈ తెల్లవారుజామున విషాదం చోటుచేసుకుంది. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్‌కుంట ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఇద్దరు వ్యక్తులపై అకస్మాత్తుగా హైటెన్షన్ విద్యుత్ వైర్లు తెగిపడటంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. చింతల్‌కుంటలోని ప్రధాన రహదారి పక్కనున్న ఫుట్‌పాత్‌పై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు నిద్రిస్తున్నారు. ఆదివారం వేకువజామున సమీపంలోని విద్యుత్ స్తంభం నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు భారీ శబ్దంతో వారిపై తెగిపడ్డాయి. క్షణాల్లో మంటలు చెలరేగి వారు నిద్రలోనే సజీవ దహనమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే ఎల్బీనగర్ పోలీసులు, విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చి, సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పరిశీలించిన పోలీసులు వారు యాచకులై ఉండొచ్చని భావిస్తున్నారు. వారి వివరాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. విద్యుత్ తీగలు తెగిపడటానికి గల కారణాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు.

# TGSRTCలో తొలి మహిళా డ్రైవర్..వాంకుడోతు సరితకు సీఎం రేవంత్‌రెడ్డి విషెస్



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టీసీలో తొలి మహిళా డ్రైవర్‌గా చేరిన వాంకుడోతు సరితకు సీఎం రేవంత్ రెడ్డి విషెష్ తెలిపారు.

అవకాశాలు వస్తే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరని సరిత నిరూపించారని అన్నారాయన. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసిన సరితకు సీఎం అభినందనలు తెలిపారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులకు మహిళలనే యజమానులుగా చేస్తున్న సందర్భంలో మహిళా డ్రైవర్ నియామకం ఓ కీలక ముందడుగు అన్నారు సీఎం. మహిళలు విద్య, విజ్ఞానం, వృత్తి, వ్యాపారం, క్రీడలు, సైన్యం వంటి అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్నారని చెప్పారాయన. గృహ బాధ్యతలతోపాటు సమాజ నిర్మాణంలోనూ మహిళల పాత్ర అపూర్వమైందన్నారు సీఎం.ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ, అడ్డంకులను అధిగమించి మహిళలు విజయాల బాటలో ముందుకెళ్తున్నారని..సరిత అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.ఇందిరా మహిళా శక్తి పథకంతో రాష్ట్రంలోని స్వయం సహాయక బృందాలకు సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు సీఎం. కోటి మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యసాధన కోసం ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని కోరారు సీఎం రేవంత్ రెడ్డి.

# ఆధ్యాత్మికం: స్వార్థం ..యజ్ఞార్థకర్మ అంటే ఏమిటి శ్రీకృష్ణుడు ఏం చెప్పాడో తెలుసా..!




**హైదరాబాద్ పెన్ పవర్:**బుద్ధియోగం, కర్మాచరణం మధ్య స్పష్టత లేక కలతపడిన అర్జునుడికి మధ్య ఉన్న సంబంధాన్ని తెలియజేస్తున్నాడు శ్రీకృష్ణుడు. ఇటువంటి పరిస్థితి చాలామంది జీవితాల్లో వస్తూనే ఉంటుంది. కాస్త తెలుసుకోగానే విషాదంతో ఉన్న మనసులో అనేక సందేహాలు ఉత్పన్నమవుతుంటాయి.

కర్తవ్యానికి, తన స్థితికి, తాను చేయదలచిన పనికి మధ్య సమన్వయం కనపడకపోవటమే దానికి కారణం. అందుకే గురువో, పెద్దలో వారికి సంశయ నివారణ చేయవలసి వస్తుంది. అయితే అది తాత్కాలికంగా ఉపయోగపడేది అయి బంధం అవుతుందా. కర్మబంధ విమోచనం కలిగించేది అవుతుందా? అన్నది ఆ పెద్దల మీద ఆధారపడి ఉంటుంది..

జీవించి ఉన్నంత కాలం కర్మాచరణం తప్పనిసరి. కాని, కర్మబంధంలో చిక్కుకోకుండా ఉండటం ఎట్లా? దానికి చక్కని పరిష్కారం చూపిస్తున్నాడు. శ్రీకృష్ణుడు... అర్జునుణ్ణి ఒక నెపంగా పెట్టుకుని... చేయదగిన పనులు..చేయదగని పనులు ఏవో తెలియజేస్తున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే.. పని చేసేప్పుడు ఫలితం వైపుకి మనసు లాగుతూ ఉంటే ఆ పనులు బంధకారణాలు. ఎందుకంటే ఆ పని చేసేప్పుడు స్వప్రయోజనాన్ని ఆశించటం ఉంటుంది. కనుక బంధహేతువు అవుతుంది.ప్రయోజనం ఆశించకుండా ఏపని అయినా చేయటం సాధ్యమా? ఎవరైనా అట్లా చేస్తారా? అంటే, అందరూ తమ కొరకు మాత్రమేకాక ఇతరుల కొరకు కూడా ఇష్టంగానో, అయిష్టంగానో చేస్తూనే ఉంటారు. ఎందుకంటే, సమాజంలో జీవించటానికి ప్రతివారు మరెంతో మంది మీద ఆధారపడి ఉంటారు. ఉదాహరణకి అన్నం తినటానికి వండుకుంటే సరిపోతుందని అనుకుంటాం. కాని, వంట చేయాలంటే ఎంతమంది సహకారం ఉండాలి? బియ్యం, కూరలు మొదలైనవి ఎవరో పండిస్తారు. వంట పాత్రలని మరెవ్వరో చేస్తారు. వంట చెఱకు ఇంకెవ్వరి పుణ్యమో, వారందరు మనకోసం వీటన్నిటిని ఎందుకు చేసి ఇవ్వాలి? ఆహారం వండుకున్న వారొక్కరే తినరుగా... ఇవన్నీ తయారుచేసిన వారు కూడా ఒకరిపై మరొకరు ఆధారపడి ఉన్నారు. ఈ పనులని ఏమీ ఆశించకుండా చెయ్యాలి.. అదే యజ్ఞార్ధ కర్మ అవుతుంది. యజ్ఞార్థకర్మ అనే మాటకి ఇతరుల ప్రయోజనం కోసం చేసే పని అని అర్థం. యజ్ఞము అంటేనే పరార్ధ కర్మ. అందుకే యజ్ఞము అనే మాటకి ఆంగ్లంలో 'శాక్రిఫైస్' అనే అర్థం ఉంది. అదే త్యాగం. త్యాగబుద్ధితో పని చేసినప్పుడు ఆ పని వల్ల కలిగే ఫలితం బంధం కాదు.. సత్కార్యం చేసినప్పుడు మంచి ఫలితం రాదని అర్థం కాదు. ఆ ఫలితం బంధం కాదని మాత్రమే తెలుసుకోవాలి. మంచి అయినా, చెడు అయినా అంతే. ఇది ప్రకృతి ధర్మం. మానవజాతికి మూలపురుషుడైన మనువు శాసనం. దానిని పాటించినప్పుడే మానవుడు అనిపించుకునే అర్హత కలుగుతుంది. ఇది వంటబట్టినట్టయితే కర్మబంధం లేకుండా కర్మాచరణం ఎట్లా చెయ్యాలో తెలుస్తుంది.

అసలు యజ్ఞార్థకర్మ అంటే ఎట్లా ఉంటుందో కూడా వివరించటం జరిగింది.. ఒక జీవి తను పుట్టించబడుతున్నాడా? తానే స్వయంగా తన ఇష్టానుసారం పుడుతున్నాడా? అని ఆలోచిస్తే తన ప్రమేయం లేకుండానే పుట్టించబడుతున్నాడని అర్థమవుతుంది. తన ఇష్టంతో అయితే ఇంకా మంచి సమయంలో, ఇంకా మంచి కుటుంబంలో, అన్ని వసతులు కలిగిన దేశంలో పుట్టేవాడే కదా. అది తనచేతుల్లో లేదు. ఎప్పుడో చేసిన చేతల్లో ఉంది. పుట్టించే సమయంలో ఏదో ప్రయోజనాన్ని ఆశించి చెయ్యరు తల్లిదండ్రులు. అదేవిధంగా సృష్టికర్త జీవులనే కాదు... ఈ సమస్త సృష్టిని సృష్టించాడు. అంతే... అతడికి దీనివల్ల ఎటువంటి ప్రయోజనము లేదు. అయినా అవిశ్రాంతంగా చేస్తూనే ఉన్నాడు. పంచ భూతాలు, సూర్య చంద్రులు. ఋతువులు... ఇట్లా అన్నిటిని సృష్టించినందువల్ల సృష్టికర్తకి ఏం లాభం? ఇది ఒక పథకం. ..ఒక ప్రణాళిక. ఆయన వలెనే జీవులు కూడా లాభాపేక్ష లేక యజ్ఞార్థకర్మ చేసి వర్ధిల్లటం ధర్మం. సృష్టిలో ఇటువంటి ధర్మాలు ఎంత స్ఫూర్తిదాయకంగా ఇమిడించటం జరిగిందో... ఉన్న ఒక్క గింజని నోట్లో వేసుకోకుండా నేలలో నాటితే కొన్ని వందల గింజలు వస్తాయి. ఈ పనివల్ల గింజకి వచ్చే లాభం ఏమైనా ఉందా? మనిషి గింజని చూసి అది నేర్చుకోవాలి.పంచభూతాలలో వాటి ధర్మాల రూపంలో దేవతలు యజ్ఞార్ధకర్మ నిర్వర్తిస్తున్నారు. వీచటం వాయువు ధర్మం. వీచటం వల్ల వాయువుకి ఏమి లాభం? దానికి లేకపోయినా జీవులకి ప్రయోజనం ఉంది కదా. అది పరహితం కోసం చేసే పని కనుక యజ్ఞకర్మ అయింది. వీచిన గాలివల్ల మేలు కలిగినా, హాని కలిగినా, సువాసన మోసుకువచ్చి ఆనందం కలిగించినా, దుర్వాసన మోసుకు వచ్చి ఇబ్బంది కలిగించినా దానికి ఎటువంటి కర్మబంధము ఉండదు.

సూర్యచంద్రుల ఉదయాస్తమానాలు, ఋతువులు.. ఇంకా ప్రకృతిలో సమస్తము తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాయి. కనుక అది యజ్ఞార్థకర్మ అయి ఫలితం బంధం కాదు. అందువల్ల వాటి పద్ధతిని పాటిస్తూ, అనుసరిస్తూ మానవుడు కూడా తన కర్తవ్యాన్ని ఫలితం ఆశించకుండా నిర్వర్తిస్తూ ఉంటే అవి మానవుణ్ణి ఆదరిస్తాయి. అంటే పర్యావరణం మనకి అనుకూలంగా ఉండాలంటే దాని పట్ల గౌరవ మర్యాదలతో (భక్తితో) మెలగాలి. పరస్పర గౌరవం శ్రేయోదాయకం. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న అనేక ప్రకృతి వైపరీత్యాలకి కారణం ఏమిటో అర్థం అవుతోంది కదా.

పంచభూతాలు, సూర్యచంద్రులు మొదలైన వాటి రూపంలో దేవతలు చేస్తున్న యజ్ఞార్ధకర్మని చూసి, అనుసరించిన మానవుడు కర్మల చేత బంధించబడడు. ముక్తి అంటే బంధరాహిత్యమే కదా.

యజ్ఞంతో పూజించినప్పుడు దేవతలు (ప్రకృతి శక్తులు) సంతోషపడతారు. అనుగ్రహిస్తారు... యజ్ఞము అంటే పూజ్యభావంతో, సమర్పణ బుద్ధితో చేసిపెట్టే పని అని అర్థం కదా. ఇతరుల శ్రేయస్సు కోసం సమర్పణ చేయటం వల్ల లభించిన దానిని యజ్ఞ శేషం అంటారు. దానివల్ల అన్ని పాపాలు నశిస్తాయి. ఫలితం తనకే కావాలని పని చేయటం పాపాలని కలిగిస్తుంది. కనుక ఇతరుల మేలు కోసం పాటుపడితే కర్మ బంధం ఉండదు.బాగా అర్థం కావటానికి ఒక చక్కని ఉదాహరణ చెప్పవచ్చు. వండుకున్నది తనొక్కరే తినటానికి అయితే వండుకున్నారు అంటాము. అందరి కోసం అయితే వండిపెట్టారు అంటారు. మొదటిది స్వార్థం. రెండవది పరార్థం, యజ్ఞార్థకర్మ, మనం ఈ మాత్రం చెయ్యలేమా అనేది గ్రహించుకోవాలని పండితులు చెబుతున్నారు.

# మహాత్ముడి ముని మనవరాలికి జైలు శిక్ష... షాకింగ్ రీజన్!



**హైదరాబాద్ పెన్ పవర్:**దక్షిణాఫ్రికాకు మహాత్మ గాంధీకి ప్రత్యేక సంబంధం ఉన్న సంగతి తెలిసిందే. భారత్ లో ఆయన స్వాతంత్రోద్యమ పోరాటానికి అక్కడ ఎదుర్కొన్న అనుభవాలు కారణమని చెబుతారు.. అక్కడ వారికి కూడా గాంధీ ఓ గొప్ప వ్యక్తిగానే గుర్తుంటారు. అయితే అలాంటి మహాత్మగాంధీ వారసురాలు, ఆయన మునిమనవరాలు అదే దక్షిణాఫ్రికాలో జైలు శిక్ష అనుభవించనున్నారు.అవును... మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ వారసురాలు, మునిమనమరాలు ఆషిష్ లత రామ్ గోబిన్ కి దక్షిణాఫ్రికాలోని దర్బన్ కోర్టు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్ఆర్ మహరాజ్ ను సుమారు రూ.3.22 కోట్లకు మోసం చేసిన కేసులో ఆమెను న్యాయస్థానం దోషిగా తేల్చింది. అలాగే.. పైకోర్టులో అప్పీలు హక్కును కూడా నిరాకరించింది.వివరాల్లోకి వెళ్తే... లత రామ్ గోబిన్ వ్యాపారా లావాదేవీల పేరుతో ఎస్ఆర్ మహరాజ్ ను నమ్మబలికి, నకిలీ డాక్యుమెంట్లు చూపి పెట్టుబడి తీసుకున్నారట. ఇందులో భాగంగా... అమ్మకానికి ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకు, ముడిసరుకు సరఫరా కోసం డీలింగ్ ఉందని చెప్పి రూ.3.22 కోట్ల రూపాయలు తీసుకొని వాటిని దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలిందట.దీంతో ఈ పిటిషన్ పై విచారణ జరిపిన దక్షిణాఫ్రికాలోని దర్బన్ కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. అనంతరం.. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. దీనికితోడు పైకోర్టులో అప్పీలు హక్కును కూడా నిరాకరించిందని తెలుస్తోంది. ఈ విషయం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఇక.. గాంధీ మనవడు మేవా రామ్ గోబిన్ కుమార్తె అయిన లతా రామ్ గోబిన్.. తనను తాను అహింసా మార్గంలో నడిచే వ్యక్తిగా, హక్కుల కార్యకర్తగా చెప్పుకునేవారంట. అయితే తాజా ఘటనతో ఆమె మోసం చేసినట్లు నిరూపితమైంది. గాంధీ సిద్ధాంతాలకు భిన్నంగా చీటింగ్ కేసులో ఆమె దోషిగా తేలి, జైలు శిక్ష అనుభవించాల్సి రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.